చదివిన బడిలోనే కొలువు

అదే పాఠశాలలో చదివారు. పట్టుదలతో విద్యాబుద్ధులు నేర్చుకుని బంగారు బాటలు వేసుకున్నారు. నేడు అక్కడే గురువులుగా మారారు. అరుదైన అనుభూతిని సొంతం చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల కిందట ఆ స్కూలులో చదువుకున్న నలుగురు పూర్వ విద్యార్థులు అక్కడే ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పాఠశాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారు. ఒకప్పుడు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుంటే వినేవారమని, ఇప్పుడు తాము అక్కడే విద్యార్థులకు చదువు చెబుతుంటే పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయని వారు మురిసిపోతున్నారు.

- నాడు విద్యార్థులు, నేడు టీచర్లు
- నలుగురు ఉపాధ్యాయులకు అరుదైన అనుభూతి



యాడికి ఉన్నత పాఠశాల

యాడికి: చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించే అవకాశం అందరికీ దక్కదు. అలాంటి అవకాశం నలుగురికి దక్కింది. యాడికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 28 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా అందులో నలుగురు అదే బడిలో ఓనమాలు దిద్దినవారే కావడం గమనార్హం. ఇక్కడే చదివిన రాజారెడ్డి గ్రేడ్ 1గా తెలుగు, చంద్రశేఖర్ గణితం, క్రిష్ణమూర్తి, తెలుగు, జ్యోతిలక్ష్మి సోషల్ టీచర్లుగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధిస్తున్నారు. స్కూలు, విద్యార్థుల అభివృద్ధికి సైతం సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇక్కడే నివాసముంటూ పాఠశాల సమయానికి కంటే ముందుగానే తరగతి గదులకు వచ్చి వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించడం వారి అంకిత భావానికి నిదర్శనం. ఇక్కడ పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు కూడా వీరి బాటలోనే పయనిస్తుండటం గమనార్హం. ఇక్కడ చదువుతున్న పలువురు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి సత్తా చాటుతున్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు.

పాఠశాల చరిత్ర ఘనం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 75 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో 1908లో ఇక్కడ సబ్ జైలుగా ఏర్పాటు చేసుకున్నారు. 1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యా బబోధన కోసం ఈ సబ్ జైలును 1950లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చారు. అప్పట్లో యాడికి మండలం నుంచే గాక పెద్దపప్పూరు మండలం, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని బూరుగల, నేరేడు చెర్ల, కొలుపల్లి గ్రామాల నుంచి చాలా మంది చదువుకునేందుకు అక్కడికి వచ్చేవారు. ఈ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న వారెందరో విదేశాల్లో, వివిధ హోదాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.



ఈ చిత్రంలో పిల్లలకు పాఠాలు చెబుతున్న తెలుగు ఉపాధ్యాయుడి పేరు క్రిష్ణమూర్తి. ఇదే పాఠశాలలో 1984–85లో పదో తరగతి పూర్తి చేశారు. 2001లో టీచర్ ఉద్యోగం వచ్చిన తర్వాత వివిధ ప్రాంతాల్లో పని చేశారు. 2017లో బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2019లో పదోన్నతి వచ్చింది. తెలుగులో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులకు మెలకువలు నేర్పుతున్నారు. చిన్నప్పుడు పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే విద్యా విధానాలు, పద్ధతులు ఇప్పటికే గుర్తుకు వస్తున్నాయని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇక్కడే పుట్టి చదువుకున్న పాఠశాలలో పనిచేయడం సంతృప్తిగా ఉందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 602 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో విధులు నిర్వహించడం మంచి గుర్తింపుగా ఉపాధ్యాయులు భావిస్తుంటారని ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు నాగన్న తెలిపారు.

అదృష్టంగా భావిస్తున్నా



నేను ఈ పాఠశాలలో 1973–78లో పదో తరగతి పూర్తి చేశాను. నా బ్యాచ్‌మేట్స్ హెచ్ఎంలుగా , ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలలో పని చేస్తున్నారు. ఇక్కడ టెన్త్ అయిపోయిన తర్వాత ఎంఏ, బీఈడీ చేసి 1987లో తెలుగు టీచరు ఉద్యోగం సాధించాను. యాడికిలో 2017లో నుంచి విధులు నిర్వహిస్తున్నాను. 2025 మే నెలలో పదవీ విరమణ చేయబోతున్నాను. చదువుకున్న పాఠశాలలో పదవీ విరమణ పొందే అదృష్టం నాకు మాత్రమే దక్కనుంది.

– రాజారెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



1987–88లో యాడికి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాను. ఆ తర్వాత ఎంఎస్సీ, బీఈడీ చదివి 1996లో యాడికి మండలంలోని చిక్కేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. 2009లో పదోన్నతిపై గణిత ఉపాధ్యాయుడిగా మండలంలోని నిట్టూరు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించాను. 2017లో బదిలీపై యాడికి ఉన్నత పాఠశాలకు వచ్చాను. చదువుకున్న పాఠశాలకే టీచరుగా రావడం సంతోషంగా ఉంది. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తాం.

– చంద్రశేఖర్, గణిత ఉపాధ్యాయుడు

ఆనందంగా ఉంది



నేను యాడికి ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి పూర్తి చేశా. ఆ తర్వాత ఎంఏ, బీఈడీ చదివి 2005లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించా. 2007లో ఉన్నత పాఠశాల సోషల్ టీచరుగా ఉద్యోగం పొంది వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాను. 2017లో బదిలీపై వచ్చి యాడికి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాను. నేను చదువుకున్న పాఠశాల కావడంతో నాకు చాలా ఆనందంగా ఉంది.

– జ్యోతిలక్ష్మి, సోషల్ ఉపాధ్యాయురాలు

క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

గుత్తి: మండల పరిధిలోని శ్రీపురం (కొజ్జేపల్లి)లో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను డ్వామా పీడీ సలీంబాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ విజయకుమార్, ఎండీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్‌డి శివాజీ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



బొంబాయి రమేష్ నాయుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఐ ఈరన్న

యాడికి: రక్తదానం ప్రాణదానంతో సమానమని యాడికి యూపీఎస్ సీఐ ఈరన్న అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయ ముంగిట సోమవారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో పోలీసు సిబ్బంది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడితో పాటు కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, యువకులు మొత్తం 123 మంది రక్తదానం చేయగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేస్, పోలీసు సిబ్బంది, యాడికి ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్, నాయకులు కోట చౌదరి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెల్టుషాపు గొడవలో ఇరువర్గాలపై అట్రాసిటీ కేసు

యల్లనూరు: బెల్టుషాపు గొడవలో ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గొడ్డుమర్రిలో ఇటీవల బెల్టుషాపు ఏర్పాటు చేసుకున్న విషయంపై తెలుగు తమ్ముళ్లు గొడవకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యోగానందరెడ్డి వర్గం, పుల్లయ్య వర్గానికి చెందిన వ్యక్తులను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తన కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పుల్లయ్య వర్గానికి చెందిన ఎస్సీ కులస్తుడు రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యోగానందరెడ్డి, దేవేందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నారాయణస్వామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. అలాగే యోగానందరెడ్డి వర్గానికి చెందిన ఎస్సీ కులస్తుడు ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లయ్య, షణ్ముఖ, కప్పల ప్రభాకర్, తలారి శ్రీను, జయచంద్ర, చిన్నలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జాతీయస్థాయి ఫెస్ట్‌లో ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి ఫెస్ట్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. ఇటీవల కర్నూలు జిల్లాలోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జీపీఆర్‌ఈసీ రూబీ జూబ్లీ వేడుకల సందర్భంగా జాతీయస్థాయి ఫెస్ట్ నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి పేపర్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో పార్వతి, వీరేంద్ర కుమార్ ద్వితీయ బహుమతిని, పేపర్ ప్రెజెంటేషన్‌లో హసీనా, తనీమ్, పల్లవి ద్వితీయ బహుమతి సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ టీసీవి రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ రఘుబాబు అభినందించారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక



మధు

గుంతకల్లుటౌన్: ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి టి.మధు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్కేయూ పరిధిలో కబడ్డీలో మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించిన మధు ఈ నెల 30 నుంచి నవంబర్ 3 వరకూ తమిళనాడులోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎస్కేయూ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, పీడీ డాక్టర్ సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి మధును వారు అభినందించారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న కలెక్టర్



ఆలయ సిబ్బందితో కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతకల్లు రూరల్: కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సోమవారం రాత్రి కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. సోమవారం గుంతకల్లు పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం ఆయన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు కలెక్టర్‌కు స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

నిబంధనలు పాటించాలి

గార్లదిన్నె: మండలంలో టపాసులు విక్రయించే దుకాణాల వద్ద నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సూచించారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ గార్లదిన్నెలో ముగ్గురు, కల్లూరులో ముగ్గురు వ్యాపారులు టపాసులు విక్రయానికి అనుమతులు పొందారన్నారు. నిర్వాహకులు ఊరికి దూరంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, దుకాణాల వద్ద భద్రత విషయంలో రాజీపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రికల్ , తూనికలు కొలతలు ఫైర్ స్టేషన్లో అనుమతి తీసుకోవాలని సూచించారు.

ద్విచక్రవాహనం ఢీ.. బాలుడికి గాయాలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని పేట శివాలయం వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనం ఢీకొని సుభాన్ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. చిన్నవడుగూరు గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ ద్విచక్ర వాహనం నడుపుతూ శివాలయం వద్ద ఆడుకొంటున్న బాలుడి ఢీ కొనడంతో కాలు విరిగింది. స్థానికులు వెంటనే బాలుడిని ప్రైవేట్ క్లినిక్ కు తీసుకెళ్లారు. అనంతరం బంధువులు బాలుడిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఘటనపై విచారణ చేపట్టామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

కౌన్సిల్ సమావేశం బహిష్కరణ



ప్రొటోకాల్‌పై మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



బహిష్కరణ అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

గుత్తి: మున్సిపల్ అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంతో సోమవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు బహిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ హాల్లో కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. ప్రారంభం నుంచి ప్రొటోకాల్ విషయంపై అధికారులను కౌన్సిలర్లు ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్లు బుసా రూపావతి, లక్ష్మిరాణి, రాజేశ్వరి, రూతమ్మ, ఫరూక్, కేవీ రమణ, వరదరాజులు, అరవింద్, ఖాజా ఖాన్, వెంకట సుబ్బయ్య, నరేష్ తదితరులు ప్రారంభంలోనే పలు అంశాలపై అధికారులను నిలదీశారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. ఆర్‌ఎస్‌లోని కర్నూలు రోడ్డులో (3,4,5,6,7వ వార్డులు) కౌన్సిల్ తీర్మానం లేకుండా, కౌన్సిలర్లు చివరకు చైర్‌పర్సన్‌కు కూడా సమాచారం ఇవ్వకుండా ఆక్రమణల పేరు చెప్పి జేసీబీలతో ఎలా తొలగిస్తారని పోడియం వద్దకు దూసుకెళ్లి అధికారులను నిలదీశారు. అసలు ప్రొటోకాల్ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. వర్క్ ఆర్డర్లు కూడా కౌన్సిల్ తీర్మానం లేకుండా ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. వార్డుల్లో అధికారులు పర్యటించిన సందర్భాల్లో కనీసం కౌన్సిలర్‌కు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ప్రొటోకాల్ పాటించడం లేదని ఆరోపిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు నచ్చజెప్పడానికి ప్రయత్నించినా వినలేదు. బాయ్‌కాట్ అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మితో పాటు కౌన్సిలర్లందరూ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు తీరును నిరసించారు. ప్రొటోకాల్ పాటించే వరకూ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యే ప్రసక్తే లేదన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిల్, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు..

పామిడి: విద్యార్థులు క్రమశిణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రిన్సిపాల్ కే సుభద్రమ్మ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. పరీక్షలంటే భయం వీడి పట్టుదలతో చదవాలన్నారు. ఇళ్ల వద్ద పిల్లలను చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాసుల సీజ్

తాడిపత్రి అర్బన్: అక్రమంగా విక్రయిస్తున్న టపాసులను అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. సీఐ సాయిప్రసాద్ తెలిపిన కథనం మేరకు.. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో కిరాణా దుకాణంలో రంగస్వామి అనే వ్యక్తి టపాసులను నిల్వ ఉంచుకుని అక్రమంగా విక్రయిస్తున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. వెంటనే సీఐ సాయిప్రసాద్ తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.2 వేలు విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకుని రంగస్వామిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జూనియర్ కళాశాలలో ఆధార్‌కేంద్రం

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆధార్‌కార్డులో అప్‌డేట్, మార్పులు, చేర్పులు కోసం క్యూ కట్టారు. మంగళవారంతో ఆధార్‌సేవలు ముగుస్తాయన్నారు. ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం నిర్వహిస్తున్న ఈ సేవలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే సుభద్రమ్మ సూచించారు.

కార్మికులకు పనిముట్లు ఇవ్వకపోతే ఎలా?



గుంతకల్లులో మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరసయ్య



గుత్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

గుంతకల్లుటౌన్/గుత్తి: పనిముట్లు ఇవ్వకపోతే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు విధులు ఎలా నిర్వర్తిస్తారని సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నరసయ్య ప్రశ్నించారు. మున్సిపల్ పీహెచ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ అనుబంధమైన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రిటైర్డ్ అయిన మున్సిపల్ రెగ్యులర్ వర్కర్లకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు 2022 పీఆర్‌సీ బకాయిలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడుతామన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పట్టణంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, జగదీష్, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే సమస్యలు పరిష్కరించాలని గుత్తిలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారికి సీపీఎం మండల కార్యదర్శి రామకృష్ణ మద్దతు తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు సూరి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి రంగన్న, రాజా, నాగేంద్ర, ఆది తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లి పొలాల సమీపంలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.15,350 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమన్నారు.



గార్లదిన్నెలో అరెస్టయిన జూదరులను చూపుతున్న పోలీసులు

జూదరుల అరెస్ట్

పుట్లూరు: మండలంలోని గోపురాజుపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. గ్రామంలోని పాత రామాలయం వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.3,470 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అలరించిన ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్



తల్లి గర్భంలో శిశువు చిత్రం



బాలికను రక్షించుకోవాలన్న చిత్రం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఆర్డీటీ రీజనల్ కార్యాలయంలో సోమవారం చేపట్టిన ఆర్ట్ ఫెస్టివల్ అలరించింది. దివ్యాంగ విద్యార్థులకు రంగోలి, పిక్చర్ పెయింటింగ్, క్లే మోడల్, హాండ్ రైటింగ్, నేచురల్ కొలేజ్, వంటి వాటిలో పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నవంబర్–14న బాలల దినోత్సవం సందర్భంగా ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని సెక్టార్ డైరెక్టర్ రఫిక్ తెలిపారు. ఆర్డీటీ డైరెక్టర్లు జులేఖ, దాదావలి, క్రిష్టారెడ్డి, ప్రసన్న కుమార్, లక్ష్మణరావు, యుగంధర్ నాయుడు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటేశ్వరి, పీఓఐసీ వసంత, ఆర్డీటీ బధిరుల ప్రధానోపాధ్యాయులు ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

పామిడి/పెద్దవడుగూరు: పామిడి పట్టణంలోని తగ్గుదేవాలయం, రంగసుభే ఫిర్కా విఠోబ ఆలయాల్లో సోమవారం వేర్వేరుగా ఏకాదశి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లోని శ్రీదేవి, భూదేవి సమేత అనంత గజగరుడ లక్ష్మీ నారాయణస్వామి దేవతామూర్తులను, పాండురంగడు విగ్రహాన్ని శోభాయమానంగా అలంకించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు. అనంతరం ఆయా ఆలయాల్లో దేవతామూర్తులను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు. భజన మండలి సంకీర్తనాలాపనల నడుమ నిర్వహించిన ఈప్రాకారోత్సవంలో భాగంగా ఆలయాలు గోవింద, పాండురంగస్వామి నామస్మరణాలతో మార్మోగాయి. అలాగే పెద్దవడుగూరు మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పామిడిలో విఠోబస్వామి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ఇదేం.. సమాచారం ?

- స.హ. చట్టం బోర్డుల్లో అన్నీ తప్పులే
- దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు

యల్లనూరు: అధికారులు మారినా ...కార్యాలయ సమాచార హక్కు చట్టం బోర్డుల్లో రాతలు మాత్రం అలానే ఉన్నాయి. పాత అధికారులు మళ్లీ వచ్చారా? అన్న అనుమానాలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి. నిత్యం అధికారులు చూస్తున్న బోర్డుల్లో తప్పులను సరిదిద్దకుంటే .. వారి పాలన ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. తహసీల్దారు కార్యాలయంలో ప్రస్తుత ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ తహసీల్దారు మహబూబ్‌బాషా పేర్లు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఖాళీ, ఐకేపీ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టరు, ఏరియా కోఆర్డినేటర్ వీరాస్వామి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు ముత్యాలప్ప పేర్లు మార్పు చేయలేదు. పాత అధికారులు పేర్లే కనిపిస్తున్నాయి. ఆయా కార్యాలయాల్లో సహ చట్టం బోర్డుల్లో తప్పులున్నాయి. వివిధ హోదాల్లో ఉన్న అధికారులు వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లినా.. వారి పేర్లే సమాచార హక్కు చట్టం బోర్డుల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డుల్లో ప్రస్తుత అధికారుల పేర్లను చేర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దారు కార్యాలయంలో స.హ.చట్టం బోర్డులో ఆర్డీఓ, డీటీ పేర్లు ఇలా..



ఎంపీడీఓ కార్యాలయ బోర్డులో మార్పు చేయని అధికారుల పేర్లు



వెలుగు కార్యాలయ బోర్డులో తప్పులు ఇలా..